క్లుప్తంగా

బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరణలో పాల్గొన్న మేయర్, కమిషనర్ తదితరులు

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పాలకవర్గం ఏర్పడి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం మూడేళ్ల ప్రగతి నివేదన బ్రోచర్‌ను అధికారులు, పాలక వర్గం సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ జక్క వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. గడిచిన మూడేళ్లలో అభివృద్ధే ధ్యేయంగా పని చేసినట్లు వెల్లడించారు. రూ.265 కోట్ల వ్యయంతో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణారావు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

వసంత పంచమి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: వసంత పంచమి వేడుకలను మల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ భవానీనగర్‌లో సరస్వతి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై సరస్వతి దేవికి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. పీఆర్ ప్రవీణ్, నెమలి రవి, సమితి అధ్యక్షులు రోహిత్ శర్మ, శశికాంత్ పటేల్, ప్రమోద్‌కుమార్, దినేష్ అగర్వాల్, జగదీష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న చంద్రశేఖర్‌యాదవ్

మౌలాలి: మౌలాలి డివిజన్‌లోని వడ్డెరరాజు బస్తీలో రూ.17 లక్షల వ్యయంతో చేపడుతున్న నూతన సీసీ రోడ్డు పనులను శుక్రవారం మల్కాజిగిరి బీజేపీ సీనియర్ నాయకుడు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. పనుల్లో నాణ్యతో పాటించడంతో పాటు త్వరగా పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.


ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న చర్లపల్లి డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు జంగయ్యను శుక్రవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆమె ఆర్థిక సాయం అందజేశారు. పూర్తిగా కోలుకునే వరకు తన సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, కనకరాజుగౌడ్, నారెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, నర్సింహ వంశరాజ్, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ, వెంకటేశ్వరనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా మామిడాల శ్రీపతి, ప్రధాన కార్యదర్శిగా పి.వీరభద్రరావు, కోశాధికారి కె.బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.హనుమాన్‌దాస్‌గౌడ్, ఎ.నర్సయ్య, ఠాకూర్ భరత్‌సింగ్, ప్రధాన సలహాదారులుగా డి.వసంతరావు, అబ్దుల్ బాసిత్, దేవేందర్, సూర్యప్రకాశ్, సంయుక్త కార్యదర్శులుగా జి.రఘురాములు, బి.కిష్టయ్యతో పాటు పలువురు ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ఆర్తీ మృతదేహం

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందగా ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలైన ఘటన నల్లగొండ జిల్లా చిట్యాల శివారులో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్ఐ ఎస్.ధర్మా తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ లక్కపాక కిరణ్‌కుమార్ తన భార్య ఆర్తీ, ఇద్దరు పిల్లలతో కలిసి ఇటీవల విజయవాడ వెళ్లాడు. శుక్రవారం కారులో తిరిగి నగరానికి వస్తుండగా చిట్యాల శివారులో వారు ప్రయాణిస్తున్న కారుకు ఓ వ్యక్తి అడ్డుగా వచ్చాడు. అతడిని తప్పించే క్రమంలో కారు చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు సీట్లో కూర్చున్న ఆర్తీ(37) తీవ్రంగా గాయపడగా ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆర్తీ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రగతి పథంలో పీర్జాదిగూడ

- పాలకవర్గం ఏర్పాటై మూడేళ్లు పూర్తి చేసుకున్న కార్పొరేషన్
- ఇప్పటి వరకు రూ.265 కోట్లతో అభివృద్ధి పనులు
- మెట్రో నగరాలతో పోటీగా ప్రగతి సాధిస్తున్న వైనం
- నగర సందర్శనకు వస్తున్న ఇతర రాష్ట్రాల అధికారులు



ఆధునిక హంగులతో నిర్మించిన వైకుంఠధామం

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది. గడిచిన మూడేళ్లలో రూ.265 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రధానంగా తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వైకుంఠ ధామాలు, పచ్చదనంలో అద్వితీయమైన ప్రగతి నమోదు చేసుకుంటూ మెట్రో నగరాలకు పోటీగా నిలుస్తోంది. పీర్జాదిగూడ నగర పాలక సంస్థను మోడల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు నిత్యం అధికారులు, పాలకవర్గం కృషి చేస్తోంది. ఇక్కడ జరుగుతున్న సంస్కరణలు, అభివృద్ధిపై అధ్యయనం చేసేందుకు పలు దేశాలు, రాష్ట్రాల అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శిస్తున్నారు. పాలకవర్గం ఏర్పడి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పీర్జాదిగూడ నగర పాలక సంస్థపై ప్రత్యేక కథనం.

2019లో కార్పొరేషన్‌గా అవతరణ..

పీర్జాదిగూడ నగర పాలక సంస్థ 2019 జూలై 23న ఆవిర్భవించింది. 2020 జనవరి 27న తొలి పాలకవర్గంలో మేయర్‌గా జక్క వెంకట్‌రెడ్డి ఎన్నికయ్యారు. నగర జనాభా 1,25,000 లక్షలు. విస్తీర్ణం 11.05 చదరపు కిలోమీటర్లు. గుర్తింపు పొందిన కాలనీలు 115 ఉండగా 34 వేల ఇళ్లు ఉన్నాయి.



నగర పాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేసిన మోడల్ టాయిలెట్స్

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు..

నగర పాలక సంస్థ పరిధిలో రూ.90.90లక్షలు వెచ్చించి 100 పార్కులను అభివృద్ధి చేశారు. 85 శాతం పార్కులు ప్రజలకు అందుబాటులోకి రాగా, మిగతా 15 శాతం పార్కులు వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయి. చిల్డ్రన్ పార్కు, ఎడారి మొక్కలతో రాక్ గార్డెన్, వాకింగ్ ట్రాక్‌లు నిర్మించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసిన భాగ్యనగర నందనవనం, జటాయువు రిజర్వు ఫారెస్టులు నగర పాలక సంస్థ పరిధిలో ఉన్నాయి. వీటితో పాటు రూ.1.64 కోట్లతో 31 ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు.

రహదారులకు అధిక ప్రాధాన్యత..

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో 258.54 కిలో మీటర్ల పొడవున రోడ్లు విస్తరించి ఉన్నాయి. రూ.44.84 కోట్ల వ్యయంతో అన్ని కాలనీల్లో సీసీ, బీటీ రోడ్లను నిర్మించారు. ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉన్న కాలనీ రోడ్లకు మధ్యలో రూ.90లక్షల వ్యయంతో డివైడర్లను నిర్మించి పచ్చదనం ఉండేలా చర్యలు చేపట్టారు. పీర్జాదిగూడ కమాన్ నుంచి ప్రతాప్‌సింగారం వరకు రూ.25 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

స్వచ్ఛ కార్పొరేషన్ దిశగా..

స్వచ్ఛ నగరం దిశగా పీర్జాదిగూడ అడుగులు వేస్తోంది. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరిస్తున్నారు. రూ.3.80 కోట్ల వ్యయంతో సమీకృత వ్యర్థ పదార్థాల పార్కు ఏర్పాటు చేశారు. తడి చెత్త నుంచి సేంద్రీయ ఎరువులు, పొడి చెత్తను రాంకీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి తరలిస్తున్నారు. కోటి రూపాయల వ్యయంతో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించారు. నగర ప్రజల కోసం 13 పబ్లిక్ మూత్రశాలలు ఏర్పాటు చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2022లో ఓడీఎఫ్ సిటీగా గుర్తింపు దక్కగా మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ప్రశంసాపత్రం అందుకున్నారు.

ఆధునిక హంగులతో వైకుంఠధామం..

పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో రూ.3 కోట్ల వ్యయంతో ఆధునిక హంగులతో మోడల్ వైకుంఠధామం నిర్మించారు. దీనిని హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాల వారి కోసం ఏర్పాటు చేశారు. రూ.5.40 కోట్లతో పార్కు స్థలాలకు కాంపౌండ్ వాల్స్, రూ.15 కోట్ల వ్యయంతో పీర్జాదిగూడ పెద్ద చెరువుకు రిటైనింగ్ వాల్ నిర్మించారు. రూ.39 కోట్లలో రిజర్వాయర్లను నిర్మించి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్నారు. రూ.7.50 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ మాంసాహార, శాఖాహార మార్కెట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రూ.88లక్షల వ్యయంతో 88 స్ట్రీట్ వెండింగ్ జోన్లు(88 షాపులు) నిర్మించారు. రూ.27 లక్షలతో కమ్యూనిటీహాల్, తెలంగాణ క్రీడా ప్రాంగణం నిర్మించారు. రూ.30లక్షల వ్యయంతో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. రూ.26 లక్షల నిధులతో బస్తీ దవాఖానా, మరో 12లక్షలతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.



చెత్త నుంచి ప్లాస్టిక్‌ను వేరు చేస్తున్న సిబ్బంది

ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతాం



ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు అధికారులు, పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోంది. అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కోవిడ్–19 మహమ్మారి సమయంలో కోవిడ్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాం. ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ సమయంలో నిరుద్యోగ యువతకు ఫ్రీ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశాం. సెట్విన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి 1200 మంది మహిళలు, యువతీ యువకులకు స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణ ఇవ్వగా వారు ఉపాధి పొందుతున్నారు. నగరంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి శాంతిభద్రతల పరిరక్షణకు, దొంగతనాల నివారణకు కృషి చేస్తున్నాం.

– జక్క వెంకట్‌రెడ్డి, పీర్జాదిగూడ మేయర్

నేడు నీటి సరఫరా బంద్

అల్వాల్: డిఫెన్స్ కాలనీలో 9ఎంఎల్ కెపాసిటీ గల నీటి రిజర్వాయర్‌ను శుభ్రపర్చేందుకు గాను శనివారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు జలమండలి అధికారులు తెలిపారు. డిఫెన్స్ కాలనీ, బాలాజీ కాలనీ, అంతయ్య కాలనీ, జేజేనగర్, సప్తగిరి కాలనీ, వినాయక్‌నగర్, రేణుకానగర్, వాజ్‌పేయీనగర్, శారదానగర్, సూర్యనగర్, చంద్రగిరి కాలనీ, శ్రీకృష్ణనగర్, ఎల్‌బీనగర్, గౌతంనగర్, ఉత్తంనగర్, మల్లికార్జుననగర్, గోపాల్‌నగర్, ఆర్కేనగర్, బలరామ్‌నగర్, పటేల్‌నగర్, దుర్గానగర్, చాణక్యపురి, హైదర్‌నగర్, అనంత సరస్వతినగర్, తాళ్లబస్తీ, తూర్పు ఆనంద్‌బాగ్ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నేడు వస్తు ప్రదర్శన ఎగ్జిబిషన్

బోడుప్పల్: చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో శనివారం వస్తు ప్రదర్శన ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నుమాయిష్ పేరుతో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు తయారు చేసిన పలు వస్తువులను ప్రదర్శనలో ఉంచుతున్నట్లు వెల్లడించారు. గాజులు, చెవి రింగులు, పెన్స్ స్టాండ్స్, మినీ కూలర్స్, టార్చ్ లైట్స్, గిఫ్ట్ బాక్స్, వాల్ హ్యాంగింగ్స్, తిను బండారాలు ప్రదర్శనలో ఉంటాయన్నారు. స్థానికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వెంకటేశ్వర్లుకు డాక్టరేట్



రామంతాపూర్: రామంతాపూర్ ప్రగతినగర్‌కు చెందిన డి.వెంకటేశ్వర్లుకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ డాక్టరేట్ పొందారు. ఇంజనీరింగ్ విభాగంలో ఇన్వెస్టిగేషన్ ఆన్ వియర్ క్యారెక్టర్ స్టిక్స్ ఆఫ్ వైనర్ మెటీరియల్స్ టు హ్యాండిల్ బల్క్ సాలిడ్స్ అనే అంశంపై ఓయూ సీనియర్ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఆయన పరిశోధనకు గాను పీహెచ్‌డీ పట్టా లభించింది. ప్రస్తుతం రాష్ట్ర సాంకేతిక విద్యా మండలిలో సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు గతంలో రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్యాకేజింగ్ విభాగాధిపతిగా పనిచేశారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

రామంతాపూర్: రామంతాపూర్ రాజేంద్రనగర్ రామాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన షిరిడీ సాయిబాబా, దత్తాత్రేయ, గణపతి దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలిగి ఆరోగ్యం, ఆనందం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు రుద్రాల నర్సింహ, రాకేష్, సంపత్, శ్రీనివాస్, సాయిబాబా, శంకరయ్య, పవన్, ప్రశాంత్, శ్రీనివాస్, ప్రధాన అర్చకులు హరిప్రసాద్ శర్మ, బీఆర్ఎస్ నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

జనప్రియ టౌన్‌షిప్ సమస్యలు పరిష్కరిస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ జనప్రియ టౌన్‌షిప్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఇక్కడ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. టౌన్‌షిప్‌లో ఓపెన్ జిమ్, ఆట వస్తువులు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాచారం సీఐ కిరణ్‌కుమార్, టౌన్‌షిప్ అధ్యక్షులు శ్రీమన్నారాయణ, ఆంటోని, చంద్రశేఖర్‌రావు, సురేష్‌కుమార్, మురళీకృష్ణ, ఉమామహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలని కార్పొరేటర్ వినతి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం భవానీనగర్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం ఈస్ట్ జోనల్ కమిషనర్ పంకజకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ వినతిపత్రం అందజేశారు. భవానీనగర్ వద్ద ఎప్పుడో నిర్మించిన చిన్న వంతెన కావడంతో ప్రజలకు ఇబ్బందిగా ఉందన్నారు. చెత్తతో పాటు గుర్రపు డెక్క పెద్ద ఎత్తున ఉంటుందన్నారు. పాత బ్రిడ్జి స్థానంలో 10 మీటర్ల వెడల్పుతో విశాలమైన బ్రిడ్జి నిర్మించాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ఆమె హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

ఎలక్ట్రానిక్స్ రీసైక్లింగ్ ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్‌ను ప్రారంభించిన అల్కేష్‌కుమార్ శర్మ

కుషాయిగూడ: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మేకిన్ ఇండియా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ సెక్రటరీ అల్కేష్‌కుమార్ శర్మ అన్నారు. చర్లపల్లిలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ (సిమెట్)లో ఏర్పాటు చేసిన 1000 కిలోల మదర్ బోర్డు రీసైక్లింగ్ ప్లాంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలతో అద్భుతాలు సృష్టిస్తున్న సిమెట్ శాస్త్రవేత్తల తీరు ప్రశంసనీయమన్నారు. మేకిన్ ఇండియాలో భాగంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం అభినందనీయమని ఆయన అన్నారు. ప్రతి ఏటా దేశ వ్యాప్తంగా 3.2 టన్నుల ఎలక్ట్రానిక్స్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయని, వాటి నుంచి విలువైన బంగారం, వెండి, పలాడియం వంటి విలువైన లోహాలను తయారు చేస్తూ దేశ పురోగతిలో భాగస్వాములవుతున్నారన్నారు.

అవయవదానంతో ఆరుగురి జీవితాల్లో వెలుగు



నర్సింహారెడ్డి(ఫైల్)

ఉప్పల్: ఉప్పల్‌కు చెందిన వ్యాపారి అన్నపురెడ్డి నరసింహారెడ్డి(47) ఈ నెల 23న ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కిమ్స్ ఆస్పత్రి అవయవదాన సమన్వయకర్తలు నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో నర్సింహారెడ్డి లివర్, కిడ్నీలు, ఊపిరితిత్తులు, గుండె తదితర అవయవాలను ఆయన కుటుంబ సభ్యులు దానం చేశారు. ఆయన మృతి చెందినా మరో ఆరుగురి జీవితాల్లో ఆనందం నింపిన నరసింహారెడ్డి భార్య, కుమారులు విజయ్, కార్తీక్‌లను పలువురు అభినందించారు.

సమస్య పరిష్కారానికి పోరాడతాం

బోడుప్పల్: వక్ఫ్ బోర్డు స్థలాల పేరుతో ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు ఆపేయడంతో ఇంటి స్థలాల బాధితులు శుక్రవారం ఐక్య కార్యాచరణ సమితి ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా బుర్ర దత్తాత్రేయ శాస్త్రి, కో చైర్మన్‌గా కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, గౌరవ చైర్మన్‌గా మహేష్ దూబే, కన్వీనర్‌గా జిన్నా శ్రీధర్, కో కన్వీనర్‌గా రాపోలు రమేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని పలు కాలనీల్లో 2018కి ముందు స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నామన్నారు. వాటిని ప్రస్తుతం వక్ఫ్ బోర్డు స్థలాలు అంటూ ప్రభుత్వం రిజిస్ట్రేషన్‌లు నిలిపివేసిందన్నారు. తమ సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో రూ.59 లక్షల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులకు శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అన్నారు. ఉప్పల్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఈఈ నాగేందర్, డీఈ నిఖిల్‌రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

భవిష్యనిధిపై ఉద్యోగులకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కుషాయిగూడ: ఉద్యోగులంతా భవిష్య నిధిపై అవగాహన కలిగి ఉండాలని ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ అర్జున్ తుక్రాల్ సూచించారు. శుక్రవారం భవిష్య నిధి(ఈపీఎఫ్)పై ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు చర్లపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ ఆడిటోరియంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా భవిష్య నిధి పెన్షన్, ఇన్సూరెన్స్ పథకాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. భవన నిర్మాణాలకు, ఫ్లాట్లు కొనుగోలు, వాహనాలు, అనారోగ్య సమస్యలకు అడ్వాన్స్ ఎలా పొందాలనే అంశాలపై ఉద్యోగులు, కార్మికులకు అవగాహన కల్పించారు. ప్రతి నెలా 27న జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో సీఐఏ అధ్యక్షుడు గోవిందరెడ్డి, ఐలా చైర్మన్ రోషిరెడ్డి, పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి చక్కా శ్రీనివాస్, సీఐఏ సెక్రటరీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి



కమాన్ ప్రారంభోత్సంలో పాల్గొన్న కార్పొరేటర్ జంగయ్యయాదవ్

బోడుప్పల్: కాలనీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు 1వ డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్ అన్నారు. రూ.50 వేల వ్యయంతో ఏర్పాటు చేసిన శ్రీమణికంఠనగర్ కమాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల అభివృద్ధికి సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పులిమామిడి బాలచారి, ప్రధాన కార్యదర్శి వి.లక్ష్మయ్య, కోశాధికారి అశోక్, కాలనీవాసులు బ్రహ్మచారి, రాజేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో ఎలాంటి పరీక్షలోనైనా విజయం



హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ తదితరులు

పరీక్షా పే చర్చలో విద్యార్థులకు ప్రధాని మోదీ సూచన



పరీక్షా పే చర్చ కార్యక్రమంలో పాల్గొన్న కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

కుషాయిగూడ: దేశ వ్యాప్తంగా నిర్వహించిన ప్రధాని 'మోదీ పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదని, పక్కా ప్రణాళికతో విద్యాభ్యాసం సాగించినట్లయితే ఎంతటి పరీక్షల్లోనైనా విజయం సొంతమవుతుందని ప్రధాని మోదీ విద్యార్థులకు సూచించారు. స్మార్ట్ వర్క్, టైం మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధాని ప్రసంగం విద్యార్థుల్లో ఉత్తేజం నింపిందని పాఠశాల హెచ్‌ఎం రంగారెడ్డి అన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నేతలు నాదం, చల్లా ప్రభాకర్, నాగమణి, గణేష్, రాంబాబు, చంద్రకళ, రమాదేవి, తేజశ్రీ, సవిత, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాచారంలో..

మల్లాపూర్: ఒత్తిడిని అధిగమిస్తే పదవ తరగతి పరీక్షలో మంచి ఫలితాలు సాధించవచ్చని బీజేపీ నేతలు మల్కా ప్రకాష్, రాగిరి మోహన్‌రెడ్డి, పద్మారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్కూల్ విద్యార్థులతో ఆన్‌లైన్లో నిర్వహించిన 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాన్ని నాచారం ఇందిరా హైస్కూల్ విద్యార్థులతో కలిసి వారు వీక్షించారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో..

రామంతాపూర్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సల్లారం నర్సింహారెడ్డి విద్యార్థులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రపంచలోని పలు దేశాలు ఆర్థిక మాంద్యం బారిన పడుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఆర్థిక విధానాలతో మన దేశం పటిష్టంగా ఉందన్నారు.

జెడ్పీ పాఠశాలలో..

రామంతాపూర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం పరీక్షా పే చర్చ ప్రత్యక్ష ప్రసారాన్ని కార్పొరేటర్ శ్రీవాణివెంకట్రావు విద్యార్థులతో కలిసి వీక్షించారు.

వైష్ణవి స్కూల్‌లో..

గణేష్‌నగర్‌లోని వైష్ణవి స్కూల్‌లో కార్పొరేటర్ కక్కిరేని చేతనాహరీష్, ప్రిన్సిపాల్ కబీర్ సోహెల్ విద్యార్థులతో కలిసి కార్యక్రమాన్ని వీక్షించారు.



రామంతాపూర్ ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీవాణి



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఇందిరా హైస్కూల్ విద్యార్థులు